రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
ప్రజా TV PRAJA TELEVISION The People's Favour
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి 8309979541
ప్రజా టెలివిజన్ తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

Bhavani Publication Trust
https://prajatheerpudaily.com
APTEL/2001/5268

# ప్రజాతీర్పు

The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

సంపుటి : 25 | సంచిక : 2 | హైదరాబాద్ | శనివారం 21 డిసెంబర్ 2024 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## ఎండుకొబ్బరికి ఎంఎస్‌పీ 422 పెంపు

3లో

## రాహుల్‌పై విచారణ



3లో



## ఖాళీ మెడికల్ సీట్ల భర్తీకి స్పెషల్ కౌన్సెలింగ్



## యాజమాన్య హక్కుల కోసమే భూ భారతి

- దోపిడీ కోసం తెచ్చిందే ధరణి
- రాష్ట్ర భూ వివరాలన్నీ దేశాలు దాటించారు
- అర్ధరాత్రుళ్లు అక్రమ రిజిస్ట్రేషన్లు విదేశాల నుంచి చేశారు
- కేసీఆర్, కేటీఆర్ దీనికి బాధ్యులు
- వారిని వదిలేది లేదు : అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్ :** భూ యజమానుల హక్కులు కాపాడేందుకే తెలంగాణ భూ భారతి (భూమిపై హక్కుల రికార్డు) బిల్లు-2024ను తీసుకొచ్చామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీలో

- మిగతా 2వ పేజీలో



# రంగంలోకి ఈడీ

## ఫార్ములా-ఈ కార్ రేస్‌పై కొరడా

- కేటీఆర్, మరో ఇద్దరిపై కేసులు
- పీఎంఎల్‌ఏ, ఫెమా చట్టాల ఉల్లంఘన కింద అభియోగాలు
- ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదు

**హైదరాబాద్:** బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మరో ఇద్దరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు కేసులు నమోదు చేశారు. ఫార్ములా-ఈ కార్ రేసుకు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అరవింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ), విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టా (ఫెమా)ల కింద వీరిపై ఈసీఐఆర్‌ను శుక్రవారం రాత్రి ఈడీ నమోదు చేసింది. అంతకుముందు, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను ఉదయం ఈడీ అధికారులు ఆ విభాగానికి లేఖ రాసి తెప్పించుకున్నారు. పది పేజీల ఎఫ్ఐఆర్‌తో పాటు దానికి సంబంధించిన ఆధార పత్రాలను కూడా ఈడీ అధికారులు తెప్పించుకొని క్షుణ్ణంగా పరిశీలించి పీఎంఎల్ఏ, ఫెమాల ఉల్లంఘనలు జరిగినట్టు నిర్ధారణకు వచ్చారని తెలిసింది. ముఖ్యంగా, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి లండన్‌లోని ఎఫ్ఈఓ, ఎస్‌నెక్ట్స్ కంపెనీలకు రూ.54 కోట్లను హెచ్ఎండీఏ ద్వారా ఏ విధంగా బదిలీ చేశారు?

- మిగతా 2వ పేజీలో



## కేటీఆర్‌పై పెట్టింది డొల్ల కేసు

### హరీశ్‌రావు

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టిన కేసు డొల్ల కేసు అని తొలి అడుగులోనే తేలిపోయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఈ రోజు రేవంత్ రెడ్డి అక్రమంగా బనాయించిన కేసును ప్రాథమికంగా పరిశీలించిన హైకోర్టు.. అరెస్టు చేయొద్దని ఉత్తర్వులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాను. ఈ కేసులో తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారు. కేటీఆర్‌కు అభినందనలు తెలియజేస్తున్నా. ఇది డొల్ల కేసు అని మొదటి అడుగులోనే స్పష్టమైందని హరీశ్‌రావు తెలిపారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఊరట లభించిన సంగతి తెలిసిందే. ఈ నెల 30వ తేదీ వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దని ఆదేశించింది. అయితే ఈ కేసును విచారణ కొనసాగించవచ్చని ఏసీబీకి సూచించింది. అలాగే కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచా రణను ఈ నెల 27వ తేదీకి వాయిదా వేసింది.



### ఫార్ములా-ఈ రేస్ కేసులో

## అణాపైసా అవినీతి లేదు..

### : కేటీఆర్

**హైదరాబాద్:** ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలతో ఈ కేసులో అవినీతి లేదని తేలిందన్నారు. ప్రొసీజర్ కరెక్ట్‌గా లేదని మాత్రమే అన్నారని చెప్పారు. ప్రభుత్వం కేసుపై ముందుకు వెళ్తే న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు. హెచ్ఎండీఏ ఒక కార్పొరేషన్ అని, హైదరాబాద్ నగర ప్రగతికి పనికి వచ్చే ఏ కార్యక్రమానికైన డబ్బులు ఖర్చు చేయవచ్చని తెలిపారు. హెచ్ఎండీఏ చేసే ప్రతి పనికి ప్రభుత్వ అనుమతి అవసరం లేదని చట్టంలోనే ఉందన్నారు. దానికి ఆ మేరకు స్వతంత్రత ఉందని చెప్పారు. అసెంబ్లీ ప్రాంగణంలో మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్ చేశారు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో కొందరు తప్పుదోవ

- మిగతా 2వ పేజీలో



## మాట ఇస్తున్నా.. ఒళ్లొంచి పనిచేస్తా..

- మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్
- ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**సాలూరు :** మాట ఇస్తున్నా.. ప్రజల కోసం ఒళ్లొంచి పనిచేస్తానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం సాలూరు మండలం సిరివర రోడ్డు పనులకు సంబంధించి మక్కువ మండలం బాగుజోల వద్ద శంకుస్థాపన చేశారు. తొలుత ఆయన సాలూరు నుంచి మండలంలో మామిడిపల్లి మీదుగా మక్కువ మండలం బాగుజోలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనలో పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల

- మిగతా 2వ పేజీలో



### దేశాభివృద్ధి కోసం

## సాంకేతిక పురోగతిని సాధించాలి: రాష్ట్రపతి ముర్ము

3

దేశంలో సాంకేతికంగా అధునాతన పరికరాలను తయారు చేయడం ద్వారా రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించే దశను ప్రారంభించే సమయం వచ్చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.

- కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్‌కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేత
- రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోమ్.. హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్, సీఎం రేవంత్

# యాజమాన్య హక్కుల కోసమే భూ భారతి

(మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లుపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ భారతి ప్రాధాన్యతను వివరిస్తూనే, బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' వెబ్ పోర్టల్ కుంభకోణాన్నీ వివరించారు. భూములకు సంబంధించిన చర్చను అసెంబ్లీలో చేపట్టడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి మేలు జరగాలని తాము భావిస్తున్నామన్నారు. దానికోసమే పటిష్టమైన చట్టాన్ని తెస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీ అహంభావం, అహంకారంతో అసెంబ్లీలో ఈ చర్చను అడ్డుకోవాలని ప్రయత్నించిందని విమర్శించారు. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం అనేక పోరాటాలు జరిగాయని గుర్తుచేశారు. రావి నారాయణ రెడ్డి, అరుట్ల కమలాదేవి, అరుట్ల రాంచంద్రారెడ్డి, మల్లు స్వరాజ్యం, భీం రెడ్డి నర్సింహారెడ్డి, చిట్యాల ఐలమ్మ వంటి వారు భూమి కోసమే పోరాటాలు చేశారన్నారు. వారు భూమిని ఆత్మగౌరవంగా, హక్కుగా భావించి సాయుధ రైతాంగ పోరాటం చేశారని వివరించారు. పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దుకు కొంతమంది భూమిపై ఆధిపత్యం చలాయించడమే కారణమని చెప్పారు. భూమిలేని పేదలకు అసైన్డ్ పట్టాలు ఇచ్చి ఇందిరాగాంధీ పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారనీ, నిజమైన భూ యజమానుల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వా లపైనే ఉందన్నారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు (కేసీఆర్) తన మెదడును రంగరించి ధరణి పేరుతో అద్భుత చట్టాన్ని తీసుకొస్తున్నామని చెప్పారని ఎద్దేవా చేశారు. 2010లోనే ఒడిస్సా ప్రభుత్వం 'ఈ-ధరణి' పేరుతో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ కంపెనీకి అప్పగించిందనీ, అనుభవం, నైపుణ్యం లేని సంస్థకు 'ఈ-ధరణి' పోర్టల్‌ను ఇవ్వడాన్ని 2014లో కాగ్ తప్పుపట్టిందని వివరించారు. అలాంటి లోపభూయిష్టమైన ధరణిని కేసీఆర్ తెలంగాణ ప్రజలపై ఎందుకు బలవంతంగా రుద్దారో చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

### ఇదీ ధరణి భాగోతం

2018లో ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సంస్థతో పాటు గాదె శ్రీధర్‌కు చెందిన ఈ సెంట్రిక్, విస్సెన్ ఇన్ఫోటెక్ సంస్థలు సంయుక్తంగా కాంట్రాక్టు సాధించు కున్నాయనీ, క్రిమినల్ నేపథ్యం ఉన్న కంపెనీలను టెండర్లలో నిషేధించే విధానం ఉన్నా, అప్పటి సీఎం కేసీఆర్ ఆ పని చేయలేదన్నారు. భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించి అన్ని రకాల బాధ్యతలు ఆ కంపెనీకి అప్పగించారనీ, ఆ తర్వాత ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ సబ్సిడరీ కంపెనీ అయిన 'టెరాసిస్' ధరణి కాంట్రా క్టును దక్కించుకుం దన్నారు. ఈ కంపెనీలో 99 శాతం షేర్లను ఫిలిప్పిన్స్ దేశానికి చెందిన ఫాల్కన్ ఎస్‌జీ అనే సంస్థ రెండు దఫాలుగా 2021లో కొనుగోలు చేసిందనీ, మిగిలిన ఒక్క శాతం వాటా మాజీ మంత్రి కేటీఆర్ మిత్రుడు గాదె శ్రీధర్‌రాజు కొనుగోలు చేశారని ఆరోపించారు. ఆ ఒక్క శాతం షేరుతో శ్రీధర్ రాజు టెరాసిస్‌కు సీఈవోగా అవతారం ఎత్తారని వివరించారు. ఆ తర్వాత ఫాల్కన్ ఎస్‌జీ (ఫిలిప్పిన్స్) సంస్థలోని వంద శాతం షేర్లను సింగపూర్‌కు చెందిన ఫాల్కన్ ఇన్వెస్టిమెంట్స్ (సింగపూర్) అనే సంస్థ కొనుగోలు చేసింది. దీనిలో వందశాతం వాటాలను స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్, జీడబ్ల్యూ స్కై, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్, పారడిగ్మీ ఇన్నో వేషన్స్, క్వాంటెలా ఐఎన్‌సీ, ఫాల్కన్ ఇన్వెస్ట్‌మెంట్స్ (సింగపూర్) అనే కంపెనీలు కొను గోలు చేశాయని తెలిపారు. ఆ తర్వాత స్పారో ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థలో 100 శాతం వాటాలు గేట్‌వే ఫండ్-2 అనే కంపెనీ చేతుల్లోకి వెళ్లాయని చెప్పారు. ఆ కంపెనీ మూలాలు పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు కేంద్రమైన సైమన్స్ ఐలాండ్ అనే దీవిలో ఉన్నాయనీ, హిల్ బ్రూక్స్ ఇన్వెస్టిమెంట్స్ సంస్థ మూలాలు కూడా పన్ను ఎగవేత, ఆర్థిక నేరాలకు నిలయమైన బ్రిటీష్ వర్జిన్ ఐలాండ్స్‌లో ఉన్నాయని తెలిపారు. ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న వారిలో ఎవరూ ఈ దేశానికి చెందిన వ్యక్తులు కాదనీ, అలాంటి వ్యక్తుల చేతుల్లోకి తెలంగాణ రైతుల భూముల వివరాలు పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్, భూ యజమానికి మధ్య ఉండాల్సిన డేటాను డిజిటల్ పోర్టల్ నెపంతో ఇతర దేశాల్లో ఆర్థిక నేరాల్లో ఇరుక్కుపోయిన సంస్థలకు అప్పగించి, రైతుల సంపూర్ణ డేటాను వాళ్ల చేతుల్లో పెట్టారని వివరించారు. ఇలాంటి దుర్మార్గ చర్యలకు పాల్పడిన వారిపై ఎలాంటి విచారణ చేపట్టాలో ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అత్యంత ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉందనీ, ఇతర రాష్ట్రాలకు మన సాంకేతికతను అందిస్తున్నామనీ, దాన్ని కాదని కేసీఆర్ ప్రభుత్వం విదేశీ కంపెనీలకు ఎందుకు అప్పగించిందని ప్రశ్నించారు. ధరణి ద్వారా ఎన్నో ఎకరాల భూదాన్ భూములు, ప్రయివేటు భూముల యజమానుల పేర్లు మారిపోయాయనీ, అగ్రిమెంట్‌లోని 9.20 క్లాజ్ ప్రకారం యజమాని పేరు మార్చడానికి ప్రభుత్వ అనుమతి తీసుకోవాలనీ, 9.20.4 క్లాజ్‌లో పేర్కొన్నట్లు ప్రభుత్వ ఆఫీసులో ఉండి పనులు చేయాలని చెప్పారు. అందుకు భిన్నంగా విజయవాడ, బెంగుళూరు, ఈశాన్య రాష్ట్రాల నుంచి ధరణిని నిర్వహించారని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో లేని కంపెనీలకు, విదేశీయులకు ధరణిని అప్పగించి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారనీ, అలాంటి వారికి ఎలాంటి కఠిన శిక్షలు వేయాలో ఆలోచించాలని చెప్పారు.



### అర్ధరాత్రుళ్లు రిజిస్ట్రేషన్లు

ధరణిలో పగలు జరగాల్సిన రిజిస్ట్రేషన్లు అర్ధరాత్రుళ్లు జరిగాయనీ, ఈ పద్ధతి ఏ రాష్ట్రంలో నైనా ఉందా అని ప్రశ్నించారు. ఈ బండారం అంతా బయటపడుతుందనే భూ భారతిపై చర్చ జరక్కుండా అసెంబ్లీలో నానా రభస చేసే ప్రయత్నం చేశారని విమర్శించారు.

### కేంద్రమంత్రి ఫిర్యాదుకే దిక్కులేదు

అప్పుడూ, ఇప్పుడూ కేంద్ర మంత్రిగా ఉన్న జీ కిషన్‌రెడ్డి తన స్వగ్రామం తిమ్మాపూర్ భూదాన్ భూములను ప్రయివేట్ వ్యక్తుల పేరుకు మార్చారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆక్షేపించారు. స్వయంగా కేంద్రమంత్రికే ఈ పరిస్థితి తలెత్తితే సామాన్యుల పరిస్థితులు ఏంటన్నారు. దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విచారణ జరిపించి కేసులు నమోదు చేశామన్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల్లో వేల ఎకరాల భూములను ఇలాగే బదిలీ చేశారనీ, ఎక్కడి నుంచైనా, ఏ పేరుకైనా మార్చేలా స్వైరవిహా రంచేసే అధికారాన్ని ఆ కంపెనీలకు అప్పగించారని విమర్శించారు. ధరణి అద్భుతమైతే శాసనసభలో ప్రతిపక్షనేత కేసీఆర్ తమను ఎందుకు నిలదీయ ట్లేదని ప్రశ్నించారు. 80వేల పుస్తకాల జ్ఞానంతో సృష్టించిన ధరణి గురించి సంపూర్ణంగా ఎందుకు వివరించట్లేదని అడిగారు.

### ఇదేం పద్ధతి?

డ్రగ్స్ సేవించిన మనిషి ఇంట్లో పట్టుబడితే గృహప్రవేశానికి పార్టీ చేసుకోవద్దా అని దబాయిస్తున్నారనీ, ఇవెక్కడి సాంప్రదాయాలని అడిగారు. ఔటర్ రింగ్ రోడ్ అమ్ముకున్నారనీ, హెచ్ఎండీఏ ఖజానాలో ఉండాల్సిన సొమ్మును పౌండ్ల రూపంలో విదేశాలకు దారి మళ్ళించారనీ, రిజర్వుబ్యాంకు నిబంధనలు కూడా పాటించలేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు ఇష్టారీతిగా వ్యవహరిస్తే, ఇకపై సభాపతి ఉపేక్షించవద్దనీ, కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని చెప్పారు.

### హరీశ్‌కు కొరడా దెబ్బలు

మాజీ మంత్రి హరీశ్‌రావు పరిస్థితి తమకు అర్థమైందనీ, అసెంబ్లీలో చొక్కాలు చించుకోకపోతే, ఆయనకు ఇంటి దగ్గర కొరడా దెబ్బలు ఉంటాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. 'ప్రజల కోసం కొన్ని కొరడా దెబ్బలు తినాలే తప్ప, మామకు అంత విశ్వాసం చూపాల్సిన అవసరం లేదని ఎద్దేవా చేశారు.

### భూభారతికి సభ ఆమోదం

సీఎం ప్రసంగం తర్వాత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భూ భారతి బిల్లును ఆమోదించాలని శాసనసభకు, స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం సభ అంగీకారంతో స్పీకర్ ఆ బిల్లును ఆమోదిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం సభ్యులు మంత్రిని అభినందించారు.

### కార్‌రేస్ సంస్థకు నేనే అపాయింట్‌మెంట్ ఇచ్చా

ఈ-కార్ రేస్ సంస్థకు చెందిన వ్యక్తి అపాయింట్‌మెంట్ అడిగితే నేనే ఇచ్చా. వాళ్లతో మాట్లాడాకే అసలు వ్యవహారం ఏంటో వెల్లడైంది. ఏసీబీ విచారణ చేస్తున్న సమయంలో, కోర్టులో వాదనలు జరుగుతున్నందున దీనిపై నేను పూర్తిస్థాయిలో వివరాలు సభలో వెల్లడించలేను. 2023 డిసెంబర్ నుంచి 2024 వరకు జరిగిన అన్ని వివరాలను ప్రజలకు అందిస్తాను. ఈ-కార్ రేస్‌పై ఏడాదిగా చర్చ జరుగుతున్నా, నాలుగుసార్లు అసెంబ్లీ సమావేశాలు జరిగినా దీనిపై ఇప్పటివరకు ఎందుకు బీఆర్ఎస్ నేతలు మాట్లాడలేదు. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి ఎప్పుడు, ఎక్కడకు పిలిచినా, చివరకు వాళ్ల పార్టీ ఆఫీసులో అయినా చర్చకు నేను సిద్ధంగా ఉన్నా. రూ.55 కోట్లు చిన్న అమౌంట్ కాదు. నేను ఒప్పుకోకపోవడం వల్లే ప్రభుత్వం రూ.600 కోట్లు నష్టపోకుండా ఆపగలిగా. బీఆర్ఎస్ సభ్యులు శాసనసభలో ప్రదర్శించిన ఫొటోలు నావే. , నా పక్కన ఉన్నది ఈ-కార్ రేస్ సంస్థ ప్రతినిధులే. వారిని కలిసి మాట్లాడాకే ఈ భాగోతం బయటపడింది.

**-ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి**



# రంగంలోకి ఈడీ

(మొదటి పేజీ తరువాయి)

హిమాయత్‌నగర్‌లోని ఐఓబీ బ్యాంకు బ్రాంచ్ నుంచి సదరు కంపెనీలకు డాలర్ల రూపంలో డబ్బు మార్పిడి ఏ విధంగా జరిపారు? అందుకు చట్టబద్ధమైన నిబంధనలను ఏ మేరకు పాటించారు? అనే తదితర కోణాల్లో కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను విచారించటానికి ఈడీ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం అవసరమైన నోటీసులను సదరు నిందితులకు పంపించటానికి ఇప్పటికే ఈడీ ఏర్పాట్లను పూర్తి చేసినట్టు సమాచారం. ఈ కేసుకు సంబంధించి వచ్చే పది రోజుల వరకు కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదని హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈడీ దర్యాప్తు శైలి ఏ విధంగా ముందుకు సాగుతుందోనన్న ఆసక్తి రాజకీయ వర్గాల్లో ఏర్పడింది. పీఎంఎల్ఏ, ఫెమా చట్టాల కింద ఏ నిందితులనైనా ఈడీ విచారించే సమయంలో ఇతర దర్యాప్తు సంస్థకు కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఏ మేరకు పరిగణనలోకి తీసుకుంటారనే చర్చ సాగుతున్నది. కాగా, ఈ కేసుకు సంబంధించి సదరు నిందితుల నివాసాలు, కార్యాలయాలు కూడా ఈడీ అధికారులు సోదా చేసే అవకాశాలున్నాయి. అలాగే, ఫార్ములా-ఈ కార్ రేసింగ్‌కు సంబంధించి విదేశీ కంపెనీ ఎఫ్‌ఈఓపై కూడా ఈడీ అధికారులు కేసులను నమోదు చేయనున్నారు. హైకోర్టు నుంచి పది రోజుల పాటు ఏసీబీ అధికారులు తనను అరెస్టు చేయకుండా వెసులు బాటు పొందిన కేటీఆర్.. ఈడీ నమోదు చేసిన కేసులపై ఏ విధంగా ముందుకు వెళ్లాలనే విషయమై న్యాయ నిపుణులతో సంప్రదిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు, పదిరోజుల పాటు కేటీఆర్‌ను అరెస్ట్ చేయరాదన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షించిన ఏసీబీ అధికారులు కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను కేవలం నోటీసు లు ఇచ్చి, పిలిపించి విచారించాలా? లేక హైకోర్టు ఇచ్చిన గడువు పూర్తయ్యే వరకు వేచి ఉండాలా అని యోచన చేస్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది.

# ఫార్ములా-ఈ రేస్ కేసులో అణాపైసా అవినీతి లేదు.. : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పట్టిస్తున్నారన్నారు. సీఎంను ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేదా ముఖ్యమంత్రే అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడంలేదని చెప్పారు. తనపై కేసు నిలవడదని స్పష్టం చేశారు. లీగల్‌గా ముందుకు వెళ్తామని, లంచ్ మోషన్ పిటిషన్‌పై కోర్టు తేలుస్తుందన్నారు.

### ఓఆర్ఆర్ లీజును ఎందుకు రద్దుచేయట్లే..

ఓఆర్ఆర్ లీజు అంశంలో సిట్ ఏర్పాటుపై కూడా కేటీఆర్ స్పందించారు. టీఓటీ పద్ధతి దేశంలో ఇప్పటికే అమలులో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లీజు డబ్బును రైతు రుణమాఫీకి ఉపయోగించామని చెప్పారు. ఆర్థిక వనరుల సమీకరణపై అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ అనేక సూచనలు ఇచ్చింది. ఓఆర్ఆర్ నుంచి డబ్బులు సేకరించవచ్చని సూచించింది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (%చీనూ×%) జాతీయ రహదారులు నుంచి డబ్బులు సేకరిస్తున్న టీఓటీ తరహాలోనే ఓఆర్ఆర్ లీజు నుంచి డబ్బులను సేకరించాం. ప్రైవేట్ కంపెనీకి లబ్ధి చేకూర్చినట్టు ఆరోపిస్తున్న రేవంత్ ఆ కంపెనీతో లీజుని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. గతంలో ఓఆర్ఆర్ లీజుపై రూ.లక్ష కోట్ల అవినీతి అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన అడ్డగోలు మాటలపై హెచ్ఎండిఏ పరువు నష్టం కేసు వేసింది. ఇప్పటికీ ఆ కేసు అలాగే ఉంది. ముఖ్యమంత్రి ఓఆర్ఆర్‌పై అనేకసార్లు కుంభకోణం అని మాట్లాడారు. మరి ఆ లీజును ఎందుకు రద్దు చేయడం లేదన్నారు.

### వాస్తవాలు ఎలా బయటకు వస్తాయ్..

రేవంత్ రెడ్డి మున్సిపల్, హోంశాఖ మంత్రిగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో సిట్ ద్వారా తన పరిధిలో ఉన్న అధికారులతో వాస్తవాలు ఎలా బయటకు వస్తాయి. తన సొంత శాఖ అధికారులతో దర్యాప్తు చేస్తే నిజాలు ఎలా బయటకు వస్తాయో రేవంత్ చెప్పాలి. అందుకే ఓఆర్ఆర్ లీజును వెంటనే రద్దుచేసి.. సిట్టింగ్ జడ్జితో కానీ రిటైర్డ్ జడ్జితో కానీ నిష్పాక్షిక విచారణ జరిపించాలి. ఒకవేళ కుంభకోణం జరిగి ఉంటే ఆయాచితంగా లబ్ధి జరిగిన కంపెనీని కాంట్రాక్టు ఎందుకు రద్దు చేయడం లేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించకుంటే ఇది మరొక రాజకీయ కక్ష సాధింపు కేసు అని ప్రజలు అనుకుంటారు. న్యాయమూర్తి ఏర్పాటు చేసే బృందం జాతీయ రహదారుల సంస్థ విధానాలను అధ్యయనం చేయాలని కూడా సూచిస్తాం. మాపై ఆరోపణలు చేసి కక్ష సాధింపుల కోసం మాత్రమే పరిమితం కాకుండా వాస్తవాలు తెలిసేలా మాట్లాడాలి. కోకాపేట భూములపై రూ.10 వేల కోట్ల కుంభకోణం అంటున్నారు. స్కామ్ అయితే ఆ భూముల అమ్మకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలి' అన్నారు. ఎమ్మెల్యేలకు శిక్షణ ఇచ్చి స్పీకర్, ప్రతిపక్ష సభ్యులపైకి వాటర్ బాటిళ్లు, పేపర్లు విసరడం ఎలా అని శిక్షణ ఇచ్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. దళితుడు అంటూ పదే పదే చెప్పడం స్పీకర్ గౌరవాన్ని తగ్గించేలా చేయడమేనన్నారు.



# పార్శిల్‌లో కుళ్లిపోయిన శవం!

ఏపీలో ఇల్లు నిర్మించుకుంటున్న నాగ తులసికి దిగ్భ్రాంతికర అనుభవం ఎదురైంది. ఓ దాత నుంచి పార్శిల్‌లో కుళ్లిన శవంతోపాటు రూ.1.3 కోట్లు డిమాండ్ చేస్తూ ఓ లేఖ రావడంతో ఆమె షాక్‌కు గురైంది. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇల్లు నిర్మించుకుంటున్న తులసి ఆర్థిక సాయం కోసం క్షత్రియ సేవా సమితిని ఆశ్రయించింది. దీంతో ఆ సమితి గతంలో ఆమె ఇంటికి అవసరమైన టైల్స్ పంపింది. అనంతరం రెండో విడత సాయం కింద విద్యుత్తు ఉపకరణాలను అందించాలని కోరడంతో.. లైట్లు, ఫ్యాన్లు, స్విచ్‌లు లాంటి వస్తువులను అందజేయనున్నట్టు మెసేజ్ వచ్చింది. అయితే, పార్శిల్‌లో కుళ్లిన శవం రాగా, డెలివరీ బాయ్ మాత్రం అందులో ఎలక్ట్రికల్ వస్తువులే ఉన్నాయనడం కొసమెరుపు.



## బీజేపీ ఎంపీల ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ : వైఎస్ షర్మిల

కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల నుంచి దృష్టిని మళ్లించడానికి బీజేపీ కొత్త నాటకం ఆడుతుందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ట్విట్టర్ వేదిక ద్వారా ఆరోపించారు. అమిత్ షా రాజీనామా చేసి, క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ పార్లమెంట్ లోపలికి వెళితే బీజేపీ ఎంపీలు అడ్డుకుని పక్కకు తోయడం వారి అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ తోపులాటలో మల్లికార్జున ఖర్గే కిందపడిపోయారని తెలిపారు. బీజేపీ ఎంపీలు వారిలో వారే కొట్టుకుని రాహుల్ గాంధీపై నింద మోపుతున్నారని ఆరోపించారు. వారి ప్రవర్తన ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా నిలుస్తోందని విమర్శించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలు ఎప్పుడూ అంబేద్కర్‌కు వ్యతిరేకంగా ఉంటాయని, అంబేద్కర్ జ్ఞాపకాలను చెరిపివేయాలని కోరుకుంటున్నాయని ఆరోపి ంచారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యల వీడియోను డిలీట్ చేయాలంటూ 'ఎక్స్'కు కేంద్రం నోటీసులు ఇవ్వడం చూస్తుంటే వారు తప్పు చేశారని అర్థమవుతోందని అన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కాషాయం మూకపై పోరాటం చేస్తూనే ఉంటుందని వెల్లడించారు.

# మాట ఇస్తున్నా.. ఒళ్లొంచి పనిచేస్తా..

(మొదటి పేజీ తరువాయి)

రోడ్లు పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం సిరివరకు రూ.9.50 కోట్లతో నిర్మించనున్న 9 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. జోరున వర్షం కురుస్తున్నా.. బురదలో కిలోమీటరు వరకు నడుచుకుంటూ కొండపై ఉన్న చిలక మెండంగి గ్రామానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలో కొద్దిసేపు పర్యటించారు. స్థానికులతో కలిసి థింసా నృత్యం చేశారు. అనంతరం తిరిగి ఆయన బాగుజోలకు చేరుకున్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో గిరిజనుల కష్టాలు తెలుసుకోవడానికే వచ్చా. రాష్ట్రంలో బీటీ,సీసీ రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సంక్షేమ వసతిగృహాల్లో సౌకర్యాలు తదితర వాటి నాణ్యతపై ప్రజలు గట్టిగా నిలబడాలి. నాణ్యతపై ప్రజలు ప్రశ్నిస్తే కలెక్టర్ మరింత చురుగ్గా పనిచేయడానికి వీలుంటుంది. సిరవర రోడ్డు పనులను డిప్యూటీ సీఎం షేషి నుంచి ప్రత్యేకంగా పర్యవేక్షణ చేస్తాం' అని పవన్ అన్నారు.

### ఏ కష్టమొచ్చినా తెలియజేయాలి..

' ప్రజల సంక్షేమం కోసం నాతో పాటు పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, నేను ఉన్నాం. మేమంతా కష్టపడి పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం. యువతకు ఉపాధి కల్పించడానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. గిరిజన యువత వివిధ నైపుణ్యాల సాధనకు కృషి చేయాలి. నైపుణ్యాలు సాధిస్తే ఉపాధి అవకాశాలు వస్తాయి. మన్యంలో పర్యాటక అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ప్రభుత్వం దృష్టికి తేవాలి.' అని డిప్యూటీ సీఎం అన్నారు.

### ఆ నిధులు ఏం చేశారో?

' గత ప్రభుత్వం మద్యంపై 25 వేల కోట్ల రూపాయలు అప్పులు తెచ్చింది. మూడు జిల్లాల్లో వివిధ ఆస్తులు తాకట్టు పెట్టి 15 వేల నుంచి 20 వేల కోట్ల వరకు రుణాలు తెచ్చారు. అయినా గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేయలేకపోయారు.. వెనుకబడిన జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది.' అని ఉప ముఖ్యమంత్రి పవన్ అన్నారు.

### నిధుల సమస్య ఉన్నా..

'ప్రతి రెండు నెలలకొకసారి మన్యం ప్రాంతాల్లో పర్యటిస్తా. క్షేత్రస్థాయిలో పర్యటించి గిరిజన గ్రామాల్లో సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తా. సీఎం చంద్రబాబునాయుడుతో చర్చించి ఉపాధి హామీ పథకం కింద రూ.రూ.46 కోట్లతో అల్లూరి, పార్వతీపురం జిల్లాల్లో 19 పంచాయతీలకు రోడ్లు



మంజూరు చేశాం. నిధులకు కొంత ఇబ్బంది ఉన్నా.. కేంద్రం నుంచి ఉపాధి హామీ నిధులు తెచ్చి రోడ్ల నిర్మాణాలకు చేస్తున్నాం. కేంద్రహోంమంత్రి అమిత్‌షాకు పార్వతీపురం మన్య జిల్లా సవర సంస్కృతి పెయింటింగ్ అందించా.' అని డిప్యూటీ సీఎం తెలిపారు. అనంతరం పనసభద్ర, పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4 కోట్ల మేర చెక్కును ఉపముఖ్యమంత్రి పంపిణీ చేశారు.

### గిరిజనుల సంక్షేమం కోసం..

గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. 'డోలీమోతలకు స్వస్తి పలకడానికి కరడవలసలో కంటైనర్ ఆసుపత్రి ఏర్పాటు చేశాం. గిరిజన ప్రాంతాలకు రోడ్లు వేస్తున్నాం. ఫీడర్ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చాం.' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ, కురుపాం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ, జగదీశ్వరి, మాధవి, కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జేసీ శోభిక, ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ అంకిత మహావీర్ సురానా తదితరులు పాల్గొన్నారు.

### పవన్ పర్యటన ఇలా...

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుక్రవారం ఉదయం 11 గంటల తరువాత సాలూరుకు చేరుకున్నారు. ఆయన రాకతో పట్టణవాసులు కేరింతలు కొట్టారు. తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద కారు నుంచి బయటకు వచ్చి పవన్ అభివాదం చేశారు. ఆ తర్వాత మామిడిపల్లి మీదుగా కాన్వాయ్ సాగింది. అన్నంరాజువలస వద్దకు వచ్చే సరికి ప్రకృతిని చూసి కాన్వాయ్‌ను ఆపించి కిందకు దిగారు. రోడ్డుపై కాసేపు నడిచి ప్రకృతిని తిలకించారు. ఆయన మళ్లీ కాన్వాయ్ ఎక్కి శంబర మీదుగా బాగుజోలకు చేరుకున్నారు. సమావేశంలో కొందరు అభిమానలు కాబోయే సీఎం, సీఎం అంటూ నినాదాలు చేస్తుండడంతో ఈ నినాదం ఇంకా పోలేదని చమత్కరించారు.



## ఖాళీ మెడికల్ సీట్ల భర్తీకి స్పెషల్ కౌన్సెలింగ్

దేశం తీవ్రమైన వైద్యుల కొరతను ఎదుర్కొంటున్నదని సుప్రీంకోర్టు శుక్రవారం చెప్పింది. మెడికల్ సీట్లు చాలా విలువైనవని, వాటిని వృథాకానివ్వరాదని తెలిపింది. ఖాళీగా ఉన్న మెడికల్ సీట్లను భర్తీ చేయడం కోసం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించింది. వైద్య కోర్సుల ప్రవేశ ప్రక్రియను ఈ నెల 30నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేసింది. కళాశాలలు కేవలం ప్రభుత్వ అడ్మిషన్ వ్యవస్థ ద్వారా మాత్రమే ప్రవేశాలను కల్పించాలని స్పష్టం చేసింది. వెయిట్‌లిస్టెడ్ క్యాండిడేట్ల నుంచి మాత్రమే ఎంపిక చేయాలని వివరించింది.



## ఔరంగజేబు వారసులు.. ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారు: యోగి ఆదిత్యనాథ్

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు వారసులు ప్రస్తుతం ఆటో డ్రైవర్లుగా జీవిస్తున్నారని తెలిపారు. ఇది దేవుడు విధించిన న్యాయమని అన్నారు. శుక్రవారం అయోధ్యలోని అసర్ఫీ భవన్ పీఠ్ వద్ద జరిగిన కార్యక్రమంలో సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. 'ఔరంగజేబు వారసులు కోల్‌కతా సమీపంలో నివసిస్తున్నారని, ఆటో కార్మికులుగా జీవనోపాధి పొందుతున్నారని కొందరు నాకు చెప్పారు. దేవాలయాలు, మతపరమైన ప్రదేశాలపై విధ్వంసక చర్యలకు ఔరంగజేబు పాల్పడ్డాడు. దైవత్వాన్ని ధిక్కరించకపోతే అతడి వారసులు అటువంటి పరిస్థితులను ఎదుర్కొని ఉండకపోవచ్చు' అని అన్నారు. కాగా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలపై యోగి ఆదిత్యనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. హిందువులు ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇది నిదర్శనమని అన్నారు. సనాతన ధర్మం, విలువలను కాపాడాలని సమాజాన్ని ఆయన కోరారు.



## ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు.. ఉభయసభలు నిరవధిక వాయిదా

పార్లమెంట్‌లో శీతాకాల సమావేశాలు నేటితో (శుక్రవారం) ముగిశాయి. విపక్ష సభ్యుల ఆందోళనల నేపథ్యంలో ఉభయసభలను నిరవధికంగా వాయిదా వేశారు. అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై విపక్ష ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తుండగానే స్పీకర్ ఓం బిర్లా లోక్ సభ ను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ కూడా సభలో ఉన్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీలో 12 మంది రాజ్యసభ సభ్యులకు చోటు కల్పించాలని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ప్రవేశపెట్టిన తీర్మానానికి రాజ్యసభ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత అమిత్ షా వ్యాఖ్యలపై సభలో విపక్ష ఎంపీలు నిరసనకు దిగడంతో రాజ్యసభను నిరవధికంగా వాయిదా వేశారు. దాంతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఇవాళ్టితో ముగిసినట్లయ్యింది. ఉభయసభల ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద .. ఇండియా కూటమి ఎంపీలు నిరసన చేపట్టారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వారు తప్పుపట్టారు. షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను అవమానించిన షా రాజీనామా చేయాలన్నారు.




## పాక్ కంటే బంగ్లాలోనే హిందువులపై ఎక్కువ హింస

హిందువులపై హింస పాకిస్థాన్‌లో కన్నా బంగ్లాదేశ్‌లో ఎక్కువగా జరుగుతున్నదని భారత ప్రభుత్వం తెలిపింది. 2024లో హిందువులపై హింసాత్మక ఘటనలకు సంబంధించిన కేసులు బంగ్లాదేశ్‌లో 2,200, పాక్‌లో 112 వెలుగులోకి వచ్చినట్లు చెప్పింది. బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత హిందువులపై హింస విపరీతంగా పెరిగిందని తెలిపింది. 2022లో వీరిపై హింసాత్మక సంఘటనలు బంగ్లాదేశ్‌లో 241, పాక్‌లో 47 జరిగాయని, 2023లో బంగ్లాదేశ్‌లో 302, పాకిస్థాన్‌లో 103 జరిగాయని పేర్కొంది. విదేశాంగ శాఖ శుక్రవారం రాజ్యసభకు ఈ వివరాలు తెలిపింది.

# దేశాభివృద్ధి కోసం సాంకేతిక పురోగతిని సాధించాలి: రాష్ట్రపతి ముర్ము

దేశంలో సాంకేతికంగా అధునాతన పరికరాలను తయారు చేయడం ద్వారా రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించే దశను ప్రారంభించే సమయం వచ్చేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. స్వావలంబన, సాంకేతిక పురోగతి, వ్యూహాత్మక సహకారాలపై దృష్టి సారించడం ద్వారా భారతదేశం తన సరిహద్దులను కాపాడుకోవడమే కాకుండా ప్రపంచ శాంతి, స్థిరత్వానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా', 'ఈజ్ ఆఫ్ డూయింగ్' వంటి కార్యక్రమాల ద్వారా వ్యాపారం, రక్షణ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు భారతీయ, విదేశీ పెట్టుబడుదారులను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. స్వదేశీకరణకు ప్రాధాన్యమిస్తూ దేశీయంగా అనేక రక్షణ ఉత్పత్తులు తయారు చేయడం జరుగుతోందన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సీడీఎం)కు 'కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు' అందజేయడానికి రాష్ట్రపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రక్షణ పరిశ్రమలో స్వదేశీ సామర్థ్యాలను పెంపొందించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. రక్షణ బలగాల అధికారులు ఆత్మనిర్భర్ భారత్ విజన్‌ను సాధించడానికి, స్వావలంబన సాధించడానికి సహకరించాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. రక్షణ ఆధునీకరణ రంగంలో భారతదేశం తన సంప్రదాయాల బలగాలను అప్‌గ్రేడ్ చేయడం, కృత్రిమ మేధస్సు, డ్రోన్‌లు, సైబర్ వార్‌ఫేర్ సామర్థ్యాలు, అంతరిక్ష రక్షణ సాంకేతికతలతో సహా అత్యాధునిక సాంకేతికతలను తెలుసుకోవడం వంటి సమగ్ర విధానంపై, ప్రపంచ స్థాయిలో వ్యూహాత్మక రక్షణ భాగస్వాములను ఏర్పాటుపై భారతదేశం దృష్టి సారిస్తుందని పేర్కొన్నారు. బహుపాక్షిక ఆర్థిక సైనిక దళాల కార్యకలాపాల ద్వారా ప్రాంతీయ,



ప్రపంచ రక్షణ చర్చల్లో భారతదేశ ప్రభావం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. గత ఐదు దశాబ్దాలుగా సీడీఎం ప్రయాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ ఆమె అభినందించారు. భారత సైన్యం, నేవీ, వైమానిక దళం, కోస్ట్‌గార్డ్‌ల అధికారుల శిక్షణలో ఉన్నత ప్రమాణాలను సాధించడానికి సీడీఎం విశేషంగా కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, కృత్రిమ మేధస్సుకు భారతదేశం అధిక ప్రా?ధాన్యాన్నిస్తోందని, వాటిని భారత రక్షణ వ్యవస్థల్లో మెరుగైన సామర్థ్యం, ప్రపంచ పోటీతత్వం కోసం ఉపయోగిస్తుందని వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చీఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) జనరల్ అనిల్ చౌహాన్, సీడీఎం కమాండెంట్ హర్ష్ చిబ్బర్, త్రివిధ దళాల అధికారులు పాల్గొన్నారు.

శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తేనీటి విందు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహించిన ఎట్ హోమ్ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే దంపతులు హాజరయ్యారు. హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావు, శాసనమండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి రాష్ట్ర మంత్రులు దామోదర, పొన్నం, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తదితరులు రాష్ట్రపతి ఎట్‌హోం కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎల్పీజీ ట్యాంకర్‌లో మంటలు.. 11 మంది దుర్మరణం

ఎల్పీజీ ట్యాంకర్ ట్రక్‌ను ఢీ కొనడంతో మంటలు చెలరేగి 11 మంది ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం ఉదయం జైపూర్-అజ్మీర్ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. సుమారు 37 వాహనాలు మంటల్లో కాలిపోయాయి. ఈ ఘటనలో సుమారు 35 మంది గాయపడ్డారని అందులో సగం మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉందని రాజస్థాన్ వైద్య శాఖ మంత్రి గజేంద్ర సింగ్ వెల్లడించారు. ట్యాంకర్ ట్రక్‌ను ఢీ కొనప్పుడు దాని నాజిల్ దెబ్బ తిని గ్యాస్ లీకవడం వల్ల మంటలు చెలరేగి చుట్టుపక్కల వాహనాలకూ వ్యాపించాయని జైపూర్ పోలీస్ కమిషనర్ తెలిపారు. చనిపోయినవారి కుటుంబాలకు రాజస్థాన్ సర్కారు రూ.5 లక్షలు, ప్రధాని తన జాతీయ సహాయ నిధి తరపున రూ.2 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించాయి. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1 లక్ష, ప్రధాని సహాయ నిధి రూ.50 వేలు పరిహారంగా ఇస్తామని తెలిపాయి.





## ఎండుకొబ్బరికి ఎంఎస్‌పీ 422 పెంపు

రానున్న 2025 సీజన్‌లో ఎండుకొబ్బరికి కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)ని క్వింటాలుకు రూ.422 పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఎంఎస్‌పీ క్వింటాలు రూ.12,100 చేరుకుంది. ఇందుకోసం రూ. 855 కోట్ల బడ్జెట్ కేటాయింపులు కేంద్రం చేసింది. ప్రధాని అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుంది. మిల్లింగ్ ఎండుకొబ్బరికి ఎంఎస్‌పీని క్వింటాలుకు రూ. 422, బంతి కొబ్బరికి ఎంఎస్‌పీని క్వింటాలుకు రూ. 100 పెంచినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దేశంలో ఎండుకొబ్బరి మొత్తం ఉత్పత్తిలో 32.7 శాతం కర్ణాటకలో జరుగుతుండగా, తమిళనాడులో 25.7 శాతం, కేరళలో 25.4 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 7.7 శాతం జరుగుతోంది.

## కీవ్‌పై బాలిస్టిక్ క్షిపణులతో రష్యా దాడి

ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై శుక్రవారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసింది. ఈ దాడిలో ఒకరు మరణించినట్లు రష్యా అధికారులు ప్రకటించారు. అమెరికా తయారీ క్షిపణులతో ఇటీవల తమ దేశంపై ఉక్రెయిన్ చేసిన దాడికి ప్రతీకారంగానే క్షిపణులను ప్రయోగించినట్టు వారు చెప్పారు. రష్యా దాడిలో కీవ్ నగరంలోని 630 నివాస గృహాలు, 16 వైద్య సంస్థలు, 30 పాఠశాలలు దెబ్బతిన్నట్టు అధికారులు చెప్పారు.



# రాహుల్‌పై విచారణ

- పార్లమెంటు ఆవరణలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటుచేసుకున్న బాహాబాహీ ఘటనకు సంబంధించి..
- పార్లమెంటు ఆవరణలో బాహాబాహీ ఘటనపై పోలీసులు ప్రశ్నించే అవకాశం
- 'అంబేడ్కర్‌కు అవమానం' అంశంనుంచి దృష్టి మరల్చేందుకే: ప్రియాంక

పార్లమెంటు ఆవరణలో అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య చోటుచేసుకున్న బాహాబాహీ ఘటనకు సంబంధించి.. ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ప్రశ్నించనున్నట్లుగా ఢిల్లీ పోలీసు వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఎంపీల మధ్య తోపులాట కారణంగా ఇద్దరు బీజేపీ ఎంపీలు గాయపడటం, రాహుల్‌గాంధీపై పార్లమెంటు స్ట్రీట్‌లోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేయటం తెలిసిన విషయమే. దీనిపై రాహుల్ మీద పోలీసులు ఎఫ్ఐఆర్ కూడా దాఖలు చేశారు. దీంట్లో భాగంగానే ప్రతిపక్షనేతను ప్రశ్నించనున్నట్లు సమాచారం. కాగా, రాహుల్‌పై నమోదైన కేసు ఢిల్లీ క్రైం బ్రాంచ్‌కు బదిలీ అయింది. ఇదే ఘటనలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే గాయపడటంపై ఆ పార్టీ నేతలు బీజేపీ ఎంపీలపై ఆరోపణలు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తోపులాట ఘటనకు సంబంధించిన సీసీటీవీ రికార్డులను పరిశీలించటానికి అనుమతించాలని పార్లమెంటు సెక్రటేరియట్‌ను పోలీసులు కోరే అవకాశం ఉందని తెలిసింది. కాగా, పార్లమెంటు ఘటన సందర్భంగా రాహుల్ తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ బీజేపీ మహిళా ఎంపీ ఫాంగ్‌నాన్ కొన్యాక్ ఆరోపించిన నేపథ్యంలో మహిళా కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కోరింది. రాహుల్‌పై ఎఫ్ఐఆర్ దాఖలు కావటంపై ఆయన సోదరి, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాంధీ




స్పందిస్తూ శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. అమిత్‌షా వ్యాఖ్యల వల్ల అంబేద్కర్‌కు జరిగిన అవమానాన్ని భారతదేశం సహించదన్న విషయం బీజేపీకి తెలుసు కాబట్టే.. ఈ తరహాలో దృష్టి మరల్చే పనులకు పాల్పడుతోందన్నారు. అంబేద్కర్ పట్ల బీజేపీకి ఉండే అసలు అభిప్రాయాలు ఇప్పుడు బయటపడ్డాయని, దీనివల్లే ఆ పార్టీ భయపడుతోందని విమర్శించారు. కేంద్రానికి చర్చలంటే భయమని, అందుకనే అదానీతోపాటు ఏ అంశంపైనా పార్లమెంటులో చర్చకు ముందుకు రావటం లేదన్నారు. రాహుల్ ఎలాంటివాడో ఆయన సోదరిగా తనకు తెలుసునని ప్రియాంక పేర్కొన్నారు. 'రాహుల్ ఎవరినీ నెట్టివేయరు. అటువంటి పని ఆయన ఎన్నడూ చేయరు. ప్రభుత్వం పూర్తి నిరాశలో కూరుకుపోయింది. అందువల్లే రాహుల్‌పై పలు తప్పుడు కేసులు నమోదు చేస్తోంది' అని ఆరోపించారు.

### ప్రియాంకకు '1984' బ్యాగును బహూకరించిన బీజేపీ ఎంపీ

ప్రియాంకా గాం?ధీకి శుక్రవారం పార్లమెంటులో అనూహ్య పరిణామం ఎదురైంది. బీజేపీ మహిళా ఎంపీ అపరాజిత సారంగి.. ప్రియాంకకు '1984' అని ఎరుపు రంగుతో రాసి ఉన్న బ్యాగును బహుమతిగా ఇచ్చారు. 1984లో ఇందిరా గాంధీ హత్య తర్వాత జరిగిన సిక్కుల ఊచకోతను గుర్తుచేసే విధంగా బ్యాగును రూపొందించారు. అయితే ప్రియాంక మాత్రం తొలుత బ్యాగును తీసుకోవడానికి నిరాకరించినా... కొద్దిసేపటికి తీసుకొని పక్కన పడేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబం?ధించిన దృశ్యాలను సోషల్ మీడియాలో బీజేపీ ఎంపీ పోస్టు చేశారు.




## హార్ట్ ఫుల్ నెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ తరగతులు

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 20**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం రోజు హార్ట్ ఫుల్ నెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించడం జరిగింది. హార్ట్ ఫుల్ నెస్ కార్యనిర్వాకుడు మంచాల గణేష్ మాట్లాడుతూ 2025 మార్చిలో జరిగే వార్షిక పరీక్షలకు విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా మానసికంగా ధైర్యంగా ఉండాలని వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని అన్నారు. ప్రతి విద్యార్థి ఉదయం, సాయంత్రం, ఇంటిదగ్గర యోగ ,ధ్యానం చేయాలని అన్నారు. ధ్యానం ద్వారానే విద్యార్థులు ఒత్తిడిని ఎదుర్కొని మానసికంగా బలంగా తయారై ఎలాంటి భయాలకు లోను కాకుండా పరీక్షల్లో విజయం సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ %+%.వనజా కుమారి, అధ్యాపకులు క్యాతం సత్యనారాయణ, వాసరవేణి పర్షరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణు ప్రసాద్, గీత ప్రవళిక గౌతమి సాగర్ తదితరులు పాల్గొన్నారు



## సిరిసిల్ల జిల్లా మినీ స్టేడియంలో 15 రకాల క్రీడా పోటీలు

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల డిసెంబర్ 20**

రాజన్న సిరిసిల్ల జిల్లా పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో 15 రకాల వివిధ క్రీడల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు.అవి అథ్లెటిక్స్, ఆర్చేరి, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్బాల్, యోగా, చెస్, కిక్ బాక్సింగ్, ఉషు, జూడో, టేబుల్ టెన్నిస్, క్యారం బోర్డ్ , కరాటే, పవర్ లిఫ్టింగ్ క్రీడలు ఆడిపించడం జరిగింది.జిల్లాలోని వివిధ మండలాల క్రీడాకారులు పాల్గొనడం జరిగింది.ఈ పోటీల అనంతరం బహుమతి ప్రధానం చేయడానికి చీఫ్ గెస్ట్ గా అగ్రికల్చర్ ఆఫీసర్లు అఫ్జల్ బేగం, ఆర్టికల్చర్ ఆఫీసర్ కె.ఆర్ లత, ఫిషరీస్ ఆఫీసర్ సౌజన్య ల చేతుల మీదుగా విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కేటగిరీలు గా గోల్డ్ సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ ను, గెలుపొందిన ఆయా విభాగాల క్రీడాకారులకు బహుకరించడం జరిగింది. అంతేగాకుండా మెరిట్ సర్టిఫికెట్లు, పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఇందులో పాల్గొన్న బెస్ట్ టీమ్స్ రాష్ట్రస్థాయిలో తేదీ 27 -12- 2024 నుండి 2 తారీకు జనవరి 2025 వరకు జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ ప్రోగ్రాంలో పాల్గొంటారని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఏ రామదాసు గారు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి , ప్రభుత్వ మరియు ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ కోచ్ లు వివిధ క్రీడా విభాగాలకు సంబంధించిన క్రీడా యూత్ అసోసియేషన్ సభ్యులు, (కరాటే ,కోకో ,వాలీబాల్ కిక్ బాక్సింగ్, జూడో) మరియు క్రీడాభిలాషులు దాదాపు వెయ్యి మంది ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారనీ జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఒక ప్రకటనలు తెలిపారు.




## కేటీఆర్ పై అక్రమ కేసులు పెట్టించింది కాంగ్రెస్ పార్టీఏ : అందే సుభాష్

**ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 20**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ నాయకులు విలేకరుల సమావేశం గురువారం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా అందే సుభాష్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అక్రమంగా ఏసీబీతో కాంగ్రెస్ పార్టీ కేసులు పెట్టించి జైలుకు పంపించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్ ను ఎదుర్కోలేక రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీ, ఈడి తదితర సంస్థలను వేట కుక్కల్లా వాడుకొని కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం చేసే తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టుతూ ప్రజల ముందు ఉంచుతున్నందుకు కక్ష కట్టి కేసులు పెట్టడం జరుగుతుందని జైలుకు పంపిస్తేనే కాంగ్రెస్ పార్టీకి న్యాయం జరుగుతుందని భావిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా చర్చ పెడితే సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ సవాల్ విసిరిన స్వీకరించలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసింది ఏమీ లేదని ప్రజలకు ఒరగబెట్టింది ఏముందని ప్రశ్నించారు.ఈ కార్ రేస్ లోరూ .55 కోట్లు పెట్టుబడి పెట్టి సుమారు రూ.700 కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడం జరిగిందని, ప్రపంచ స్థాయిలో జరిగే ఈ రేసు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచడం కొరకు హైదరాబాద్‌కు తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. హైదరాబాదుకు ఐటీ హబ్బు ద్వారా బెంగుళూరు, ముంబాయి, పూణేను తల దన్నే విధంగా తీర్చిదిద్దిన గొప్ప నాయకుడు కేటీఆర్ అని కితాబిచ్చారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్, పట్టణ అధ్యక్షులు ఎద్ల సందీప్, నాయకులు ఎనగందుల నరసింహులు, మాజీ సర్పంచ్ తిరుపతి నాయక్, హరిదాస్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షులు నాగరాజు,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు సిత్యా నాయక్, ఎనగందుల బాబు, యువజన నాయకులు జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

- ఈ దేశ ప్రజలకు అమిత్ షా క్షమాపణలు చెప్పాలి
- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధనికి యత్నం, అడ్డుకున్న పోలీసులు

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల డిసెంబర్ 20**




రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో పార్లమెంట్ సాక్షిగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను తన మంత్రి పదవి నుంచి తొలగించాలని అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం రోజున అంబేద్కర్ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేయడానికి ప్రయత్నించారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకొని అడ్డుకున్నారు. అనంతరం అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పి మంత్రి పదవి నుంచి తొలగించాలని నిరసన చేశారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ ,ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముక్తికాంత అశోక్ లు మాట్లాడుతూ... కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించారని ఎగతాళి చేసి అహంకారపూరితంగా మాట్లాడటానికి అంబేద్కర్ వాదులు ప్రజాసామిక వాదులు ప్రజలు ఖండించాలని అన్నారు. అదేవిధంగా బీజేపీకి అంబేద్కర్ పట్ల ఉన్న ప్రేమను పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా తెలియజేశారని అన్నారు. ఈదుర్మార్గమైన, దారుణమైన అహంకార చర్యను అందరూ ఖండించాలని అన్నారు. అమిత్ షా అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ఫలితంగా పార్లమెంటులో కూర్చున్నారని మంత్రి పదవి అనుభవిస్తున్నారని అది మర్చిపోయి ఇలా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. అంబేద్కర్ అంబేద్కర్ అంటూ పదేపదే అతని పేరు స్మరించుకుంటారు..ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్, మాల మహానాడు నాయకులు రాగుల రాములు,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మందా అనిల్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ చంద్ర, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి గుండెల్లి కళ్యాణ్, నాయకులు సాయి, భరత్,శివ, వేణు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాల సాధనకు నిమగ్నమైన ప్రజల సమూహం

**అమిత్ షా అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన. దిష్టిబొమ్మ దహనం.**




**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 20)**

ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ ఫోరమ్ నిర్మల్ జిల్లా కమిటీ, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ( టి ఏ జి ఎస్),కె.వి.పి.ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల రాజ్యసభలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, అంబేద్కర్ వంటి మహనీయులను ఉద్దేశించి "అంబేద్కర్ అని పదేపదే జపించడం ఒక ఫ్యాషన్ అయిపోయింది, దేవుని తలచుకుంటే స్వర్గానికి పోతారు" అని చేసిన వ్యాఖ్యలను ఆక్షేపించారు. ఈ వ్యాఖ్యలు అంబేద్కర్ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నాయని, ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాతకు అవమానకరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమిత్ షా తన వ్యాఖ్యలకు వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని,హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని కోరారు. బీజేపీ పాలన రాజ్యాంగ మార్పులకు ప్రణాళిక చేయడం దళిత, గిరిజన, బలహీన వర్గాలపై కుట్రగా నిలుస్తోందని విమర్శించారు దళితుల హక్కులు, గిరిజనుల రిజర్వేషన్లు, బలహీన వర్గాల అభివృద్ధికి రాజ్యాంగ మార్గదర్శకంగా నిలిచిన అంబేద్కర్ జీవితం దేశానికి గొప్ప ఆదర్శమని కొనియాడారు. బీజేపీ మనుస్మృతి దిశగా దేశాన్ని నడిపించాలని ప్రయత్నిస్తున్నదని, దీన్ని ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. అమిత్ షా క్షమాపణ చెప్పకపోతే, కేంద్ర మంత్రివర్గంలో నుంచి తప్పుకోకపోతే, భవిష్యత్తులో దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోసిపిఎం జిల్లా నాయకులు ఫసి ఉద్దీన్, ఎస్సీ ఎస్టీ అడ్వకేట్ ఫోరమ్ అధ్యక్షులు ఆర్. రత్నం, టి ఏ జి ఎస్ జిల్లా కార్యదర్శి తొడసం శంబు, కె.వి.పి.ఎస్ జిల్లా నాయకులు పోశెట్టి. వీరితోపాటు సిపిఎం జిల్లా నాయకులు రాజేశ్వర్, అతిక్, గంగారాం, మున్నా, భీమ్ రావు, పంద్రం ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల కార్యవర్గ నియామకం

**ఎండపల్లి, డిసెంబర్ 20( ప్రజా తీర్పు ప్రతినిధి)**



జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుల( ఫీల్డ్ అసిస్టెంట్ ) ల నూతన కార్యవర్గం ( ఐఎన్టీయూసీ అనుబంధం) జగిత్యాల జిల్లా కోశాధికారి కాసం సంతోష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వడ్కాపురం అశోక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గజ్జెల రాజేష్(గొడిసెల పేట ), ఉపాధ్యక్షునిగా జుంజుంపల్లి సురేష్( చర్లపల్లి ), ప్రధాన కార్యదర్శిగా దమ్మాల సురేష్( మారేడుపల్లి ), కోశాధికారిగా ఆషాడపు సరిత ( సూరారం) లతోపాటు గౌరవ సలహాదారునిగా బొంగాని శ్రీనివాస్ గౌడ్( రాజారాం పల్లి )లు నియామకమయ్యారు.



## సిరిసిల్లలో చేనేత కార్మికులు ఉరివేసుకొని ఆత్మహత్య

**ప్రైవేట్ బ్యాంకుల వేధింపుల వాళ్లనే ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడు లేక**

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల డిసెంబర్ 20**

రాజన్న సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని ఓ చేనేత కార్మికుడు గురువారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం పట్టణంలోని గాంధీనగర్ కు చెందిన దూస గణేష్(49 ) అనే వ్యక్తి మరమగ్గాల కార్మికుడిగా శ్రీరామ్ విష్ణు వద్ద పని చేస్తూ ఉండే వాడు.మృతుడు తన అవసరాల నిమిత్తం దాదాపు రూ. 5,00, 000/-లక్షల వరకు పలు బ్యాంకుల్లో అప్పు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.అప్పులు ఇచ్చిన వారు డబ్బుల కోసం తీవ్రంగా వేదించడంతో చేసిన అప్పులు కట్టలేక మనస్థాపానికి గురై గురువారం ఉదయం 07.15 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకునట్లు తెలిసినది. మృతుడికి భార్య,ఇద్దరు కుమార్తెలు కలరు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్నకు చేయూత, నేతన్న భీమ వంటి పథకములలో నమోదు కావడం జరిగినది. పోస్ట్ మార్టం రిపోర్ట్, ఫైర్ , డెత్ సర్టిఫికెట్స్ వచ్చిన తర్వాత నేతన్న భీమ విడుదలకై సిపారసు చేయబడును. కావున, మృతుడు అప్పులు మరియు కుటుంబ కలహాల వలన ఆత్మహత్య చేసుకున్నాడు, కానీ మరణానికి సంబంధించి వృత్తి పరమైన ఇబ్బందులు కారణం కాదు అని తెలిపారు.

## జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ముఖ్య అతిథి గా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 20)**




నిర్మల్ జిల్లా పట్టణం కేంద్రం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదరులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన,సాంస్కృతిక పండుగ అని అన్నారు.ప్రతి ఏటా క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. ఈ రోజు ఈ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. అన్ని మతాల ప్రజలు మతసామ రస్యాన్ని పాటిస్తూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకలలో అదనపు ఎస్పీ ఉపేందర్ రెడ్డి, ఏఎస్పి అవినాష్ కుమార్, డిఎస్పీ గంగారెడ్డి, ఏ ఓ యూనిస్ అలి, ఇన్స్పెక్టర్ లు నవీన్ కుమార్, నైలు, సైదా రావు, రామ కృష్ణ , మల్లేష్, కృష్ణ, రమణ రావు ఆర్ ఐ లు రాం నిరంజన్ రావు, రమేష్, రామ కృష్ణ, ఎస్ఐ లు ప్రదీప్, నరేష్, లింబాద్రి, సందీప్ కె, గోపి, శ్రీకాంత్, సందీప్ ఏ, సాయి కుమార్, సాయి కిరణ్, అశోక్, సాగర్, ఆర్ ఎస్ఐ లు వినోద్, రవి కుమార్, రాజ శేఖర్, రవి ఎం , డిపిఒ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాచర్ల గొల్లపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా స్వామి గౌడ్

**ప్రజా తీర్పు బ్యూరో చీఫ్ సిరిసిల్ల/ ఎల్లారెడ్డిపేట డిసెంబర్ 20**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి గౌడ సంఘం అధ్యక్షుడిగా కొండ స్వామి గౌడ్ నువ్వు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం రోజు నూతన కమిటీ లో భాగంగా ఉపాధ్యక్షుడిగా కొ%శీ%డ పెద్దనరసయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శిగా పందిల్లరవికాంత్ గౌడ్,కోశాధికారిగా ఆకుల నాగభూషణంగౌడ్, సలహాదారులుగా, పాముల లక్ష్మణ్ గౌడ్, పందిల్ల గణపతిగౌడ్, కొండ చిన్ననర్సయ్యగౌడ్, పందిల్లశ్రీనివాస్ గౌడ్,తీగల చిన్న అంజాగౌడ్, తీగలదశరథంగౌడ్ లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ్ హక్కుల సంఘంతోపాటు సభ్యుల పట్ల ఎలాంటి ఆపద వచ్చినా ముందుకు ఉండి గౌరవ పెద్దల సలహాలు సూచనల అభివృద్ధి బాట లోకి తీసుకెళ్తామని అన్నారు. నూతన కమిటీని ఎన్నుకున్నందుకు తోడి కుల సంఘ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గౌడ సంఘసభ్యులు పాల్గొన్నారు.




## కుంగ్ పూ అకాడమీ రాష్ట్రస్థాయి పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులు

**ఎండపల్లి/ధర్మారం డిసెంబర్ 20 : ( ప్రజా తీర్పు ప్రతినిధి )**

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండల కేంద్రం లోని బ్రిలియంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కుంగ్ పూ అకాడమీ నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలల్లో అత్యంత ప్రతిభ కనబరిచి, పతకాలు సాధించారు. కటాస్ మరియు స్పారి గ్రా విభాగంలో బి.అనూష్, గోల్డ్ విశ్వతేజ,గోల్డ్ రిషి, గోల్డ్ ప్రగాణన్,బ్రౌన్జ్ వర్షిత్, గోల్డ్ పి.వర్షిత్,బ్రౌన్జ్ విశ్వతేజాస్,గోల్డ్ కార్తీక్, గోల్డ్ అక్షిత,గోల్డ్ అవని,శ్రీ గోల్డ్ సిద్ధార్థ, గోల్డ్ గౌతమ్, బ్రౌన్జ్ అరుణ్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కుంగ్ పూ కరాటే మాస్టర్, పాఠశాల ఇంచార్జి లతోపాటు బ్రిలియంట్ విద్యా సంస్థల చైర్మన్ సిరిపురం సత్యనారాయణ లు అభినందించారు.




## దివ్యాంగులందరికీ 100% ఉచిత బస్సు ప్రయాణం అందించాలి..

**(ప్రజాతీర్పు జిల్లాప్రతినిధి నిర్మల్ డిసెంబర్ 20)**

దివ్యాంగులందరికీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరారు. శుక్రవారం నిర్మల్ బస్ డిపో మేనేజర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో అర్హులైన దివ్యాంగులకు మాత్రమే 50% రాయితీ అందిస్తున్నారని అయితే, దివ్యాంగులందరికీ 100% ఉచిత బస్సు ప్రయాణం అందించాలనే మా కోరికను మీరు పరిగణనలోకి తీసుకోవాలని.మా జీవన పరిస్థితులు శారీరక, మానసిక, ఆర్థిక ఇబ్బందులతో కూడి ఉన్నయన్నారు.. ఇలాంటి పరిస్థితుల్లో, సకలాంగులైన మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించినట్టు, మాకు కూడా పూర్తి రాయితీ అందించడం ద్వారా మీరు మానవతా దృక్పథంతో ఆలోచించి మాకు సహాయపడాలని వేడుకున్నారు. మీరు ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదించి, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దివ్యాంగులు జిల్లా అధ్యక్షులు సిహెచ్. నరసయ్య,రాష్ట్ర కన్వీనర్ సత్తి సాయన్న, కో కన్వీనర్ కే. ప్రవీణ్ కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి టి. ముత్యం,కోశాధికారి కే. భగవాన్, ఇతర దివ్యాంగుల కమిటీ సభ్యులు.

## సహకార శాఖలో పదోన్నతులు కల్పించాలి

**హైదరాబాద్:** తెలంగాణ సహకార శాఖ ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని, శాఖ అనుబంధ విభాగాల్లో పనిచేసేందుకు డిప్యుటేషన్లను కొనసాగించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరింది. ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు, సహకార గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, ఇతర నేతలు మంత్రిని గురువారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సహకార శాఖలో దీర్ఘకాలంగా పదోన్నతులు లేక ఆ ఉద్యోగంతోనే పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# కెపిహెచ్ బి కాలనీలో ఘనంగా ఆర్కె చౌదరి పుట్టినరోజు వేడుకలు

**కూకట్పల్లి, డిసెంబర్ 20(ప్రజాతీర్పు)**

సేవా కార్యక్రమాలు నిర్వహించే సైనికుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన సూర్య ఉదయం పత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా..నాయకులు..

కూకట్ పల్లి తెదాపా స్టేట్ యువజన నాయకుడు మొరంపూడి రామకృష్ణ జన్మదిన సందర్భంగా కేపీహెచ్బీ కాలనీ వివిధ సెంటర్లలో సంబరాలు జరిగినది , ధర్మారెడ్డి కాలనీలో రామాలయం దగ్గర భారీగా తరలివచ్చిన ఆర్కే యువసేన యువత మరియు మిత్రులు విచ్చేసి భారీ కేకు కట్ చేయించి శాలువాలతో సన్మానం చేసి ప్రతి ఒక్కరు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్కె మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన పెద్దలకు అలాగే మిత్రులకు ప్రతి ఒక్కరికి ధన్యవాదములు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అట్లూరు దీపక్, చెరుకూరి రవి, సురేంద్ర ,సాయి, అనిల్, తేజ, స్వరూప్ ,నవీన్, సుబ్బు, హేమంత్, వినయ్, గోపి, మరియు ఆర్కే యువసేన యువత పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాజేష్ గౌడ్, లడ్డు, గిరి, తదితరులు పాల్గొన్నారు.



తదుపరి టిడిపి భవన్ లో పొగాకు జయరాం మరియు నరేష్ ముదిరాజ్ వారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేసినారు. కె పి హెచ్ బి రోడ్ నెంబర్ 2 లో పివి రమణ వారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు రమణ వారు మాట్లాడుతూ ఇలాగే నువ్వు ఎన్నో సేవలు చేస్తూ అంచలు అంచలుగా ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని మరొకసారి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కెపిహెచ్బి రమ్య గ్రౌండ్ వద్ద ప్రెస్ కార్యాలయం లో రామకృష్ణ ( ఆర్కె) జన్మదిన వేడుకలు జరిగినవి. ఈ కార్యక్రమంలో సూర్య ఉదయం తెలుగు దినపత్రిక తెలంగాణ ఎడిటర్ బాషా మరియు సునీల్ కుమార్, సద్దాం, నాగేంద్ర (బుజ్జి), బాలకృష్ణ, పాల్గొన్నారు...



## అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం...

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం శేరిలింగంపల్లి కమిటీ ఆధ్వర్యంలో చందానగర్ లో అంబేద్కర్ విగ్రహం దగ్గర కేంద్ర హోం మంత్రి అమిత్ షా అంబేద్కర్ పైన చేసిన వాక్యాలపై నిరసనగా అమీషా దిష్టిబొమ్మ ను దగ్ధం చేశారు . భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కించపరచడం అంటే దేశాన్ని అవమానించడమే . భారత రాజ్యాంగంపై ప్రమాణం చేసి అమిత్ షా గద్దెనెక్కిన తర్వాత అంబేద్కర్ ని అవమానించడం అత్యంత హేయమైన చర్య .బిజెపి ప్రభుత్వం తక్షణమే అమీషాను తన పదవి నుంచి భర్తరఫ్ చేయాలి దేశ ప్రధాని నరేంద్ర మోడీ భారత పౌరులకు క్షమాపణ చెప్పాలి. భారతదేశ పౌరులకు దేశ ప్రజలందరికీ అంబేద్కర్ దేవుడు. బిజెపి ప్రభుత్వము అమిత్షాను భర్త రఫ్ చేయకపోతే దేశ ప్రజలు నరేంద్ర మోడీని అమిత్ షాను బిజెపి ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేస్తారని హెచ్చరించారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ల ద్వారానే అమిత్ షాకు కేంద్రంలో హోంమంత్రి దక్కిందని విషయాన్ని మర్చిపోయారని అన్నారు. ఈ దేశంలో ప్రతి మనిషి ఆత్మ గౌరవంగా బ్రతుకుతున్నాడు అంటే అది కేవలం అంబేద్కర్. మతోన్మాద బిజెపి తన ఆలోచన ధోరణి మార్చుకోకపోతే ఈ దేశంలో మతకల్లో లాలు సృష్టించాలని ప్రయత్నం చేస్తే దేశ ప్రజలు కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వాన్ని బొందపెడతారు అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండలకార్యదర్శి ఎస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వై.వెంకటేష్, సి.రాజు, కెవిపిఎస్ నాయకులు సత్యము ,శ్రీనివాసు ,సిపిఎం శేరిలింగంపల్లి కార్యదర్శి శోభన్, కాంగ్రెస్ నాయకులు కవిరాజు, సూర్య ,సిఐటియు కార్యదర్శి కృష్ణ, వరుణ్ ,మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాబిషేకము.

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజా తీర్పు ప్రతినిధి, (సందీప్) డిసెంబర్ 20**

పాల్వంచ మండలం, కేశవాపురం జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మ గుడి) నందు శుక్రవారం ను పురస్కరించుకొని అమ్మవారికి పంచామృతముల తో వైభవముగా అభిషేకము నిర్వహించ బడినది. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్కు పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఇట్టి కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీ కుమారి, భక్తులు, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు.

## సహకార శాఖలో పదోన్నతులు కల్పించాలి

**మంత్రి తుమ్మలకు ఉద్యోగ సంఘాల ఐకాస వినతి**

హైదరాబాద్: తెలంగాణ సహకార శాఖ ఉద్యోగులు, అధికారులకు పదోన్నతులు కల్పించాలని, శాఖ అనుబంధ విభాగాల్లో పనిచేసేందుకు డిప్యుటేషన్లను కొనసాగించాలని తెలంగాణ ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరింది. ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాసరావు, సహకార గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌రావు, ఇతర నేతలు మంత్రిని గురువారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సహకార శాఖలో దీర్ఘకాలంగా పదోన్నతులు లేక ఆ ఉద్యోగంతోనే పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# ఇగ్నిసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ స్పోర్ట్స్ కార్యక్రమం

**పిల్లల ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి...**

**మాదాపూర్ డీసీపీ డా.వినీత్....**

**శేరిలింగంపల్లి, ప్రజాతీర్పు**



ఇగ్నిసిస్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ యుఫోరియా 2024-2025 స్పోర్ట్స్ మీట్ కార్యక్రమా న్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతి తులుగా మాదాపూర్ డిసిపి డాక్టర్ వినీత్, పద్మశ్రీ జ్ఞాన గాంధీ విచ్చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఇతర కల్చరల్ క్రికెట్, డాన్సింగ్, బాక్సింగ్ ,లాంటి భరతనా ట్యం, ఇలాంటి కార్యక్రమాలను ముఖ్య అతిథుల ముందు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాదాపూర్ డిసిపి డాక్టర్ వినీత్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అని అన్నారు. ఇక్కడ ఈ పిల్లలు చేస్తున్న నృత్యాలు చూస్తుంటే నా స్కూల్ చిన్నతనం గుర్తొస్తున్నాయని ఆయన తన జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ స్కూల్ పిల్లలలో చదువుతో పాటు ఎంతో నైపుణ్యత, క్రీడా ఉత్సవం ఎంతగానో ఉంది అని కొనియాడారు. ఈ పిల్లలు చేస్తున్న నృత్యాలు చూస్తుంటే కళ్ళు చెదిరే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ ప్రదర్శనలు ఎంతో గొప్పగా ఉన్నాయని పిల్లలు బావి భవిష్యత్తులో మరింత పైకి ఎదగాలని మాదాపూర్ డిసిపి వినీత్ సూచించారు. అనంతరం పద్మశ్రీ జ్ఞాన గాంధీ మాట్లాడుతూ పిల్లలకు చదువుతోపాటు క్రీడలకు సంబంధించిన అన్ని ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ స్కూల్ యాజమాన్యం పిల్లలకు ఎంతగానో చదువు చక్కగా చెప్పి వారి భవిష్యత్తును ఇంకా పైకి తీసుకెళ్లడానికి మరింత కృషి చేయాలని నేను కోరుకుంటున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సీఈవో దివ్య దంపతులతో పాటు, స్కూల్ యాజమాన్యం సిబ్బంది పాల్గొన్నారు.

ఆయూశి విజృంభణ..

# ఫైనల్లో యువ భారత్

## అండర్-19 ఆసియాకప్ టోర్నీ



అరంగేట్రం మహిళల అండర్-19 ఆసియాకప్ టోర్నీలో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో యువ భారత్ 4వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘన విజయం సాధించింది. టోర్నీలో అపజయమెరుగని భారత్..తుది పోరులో నిలిచింది. తొలుత ఆయూశీ శుక్లా(4/10) ధాటికి లంక 20 ఓవర్లలో 98/9 స్కోరుకు పరిమితమైంది. ఈ యువ లెఫ్టార్మ్ స్పిన్నర్ ధాటికి లంక బ్యాటర్లు స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. కెప్టెన్ మనుడి నానయకర(33) టాప్‌స్కోరర్‌గా నిలిచింది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ ఆయూశి స్పిన్ మాయాజాలంతో చెలరేగడంతో లంక దగ్గర సరైన సమాధానం లేకపోయింది. ఓపెనర్లు సంజన(9), హిరుణి హన్సిక(2) 12 పరుగులకే పెవిలియన్ చేరగా, ఐదో వికెట్‌కు నానయకర, నిసానసల నెలకొల్పిన 22 పరుగుల భాగస్వామ్యం అత్యుత్తమమైంది. ఆయూశీకి తోడు పరునిక సిసోడియా(2/27) రెండు వికెట్లు పడగొట్టారు. ఆ తర్వాత 99 పరుగుల కోసం లక్ష్యఛేదనకు దిగిన భారత్ 14.5 ఓవర్లలో 102/6 స్కోరు చేసింది. పరుగుల ఖాతా తెరువకుండానే ఐశ్వరి(0) ఔట్ కాగా, కమలిని(28) ఆకట్టుకుంది. టోర్నీలో తన సూపర్‌ఫామ్‌ను కొనసాగిస్తున్న తెలంగాణ యువ బ్యాటర్ గొంగడి త్రిష(32) అత్యధిక స్కోరుతో జట్టు విజయంలో కీలకమైంది. లంక బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ త్రిష తన ఇన్నింగ్స్‌లో 2 ఫోర్లు, 3 భారీ సిక్స్‌లతో అలరించింది. సనిక(4), కెప్టెన్ నికి ప్రసాద్(3), భవిక(7) విఫలమయ్యారు. ప్రభోద (3/16), గిమ్హాని (2/18) ఆకట్టుకున్నారు. నాలుగు వికెట్లతో విజయంలో కీలకమైన ఆయూశికి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

### సంక్షిప్త స్కోర్లు

**శ్రీలంక: 20 ఓవర్లలో 98/9(నానయకర 33, నిసానసల(21), ఆయూశి 4/10, పరునిక 2/27),**

**భారత్: 14.5 ఓవర్లలో 102/6 (త్రిష 32, కమలిని 28, ప్రభోద 3/16, గిమ్హాని 2/18)**



# టైటాన్స్ ఘన విజయం

ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) 11వ సీజన్ లీగ్ దశను తెలుగు టైటాన్స్ విజయంతో ముగించింది. శుక్రవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో టైటాన్స్ 48-36 తేడాతో పుణెరి పల్టాన్‌పై అద్భుత విజయం సాధించింది. టైటాన్స్ జట్టులో కెప్టెన్ పవన్ సెహ్రావత్(15 పాయింట్లు) మరోసారి సూపర్-10తో కదంతొక్కాడు. పవన్‌కు తోడు ఆశీష్ నార్వల్ (11), డిఫెండర్ అంకిత్(6) కూడా సత్తాచాటారు. పుణె జట్టులో అజిత్(10), ఆర్యవర్ధన్ (8) ఆకట్టుకున్నారు. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 12 విజయాలు సాధించిన టైటాన్స్ 66 పాయింట్లతో యూ ముంబాతో సమంగా నిలిచింది. లీగ్‌లో ఇప్పటికే ఐదు బెర్తులు ఖరారు కాగా, మరో బెర్తు ఎవరిదో త్వరలో తేలనుంది. మరోవైపు 21 మ్యాచ్‌ల్లో 10వ ఓటమితో పుణె(55) ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.



# ఆల్ఇండియా రన్నరప్ అనన్య

చండీగఢ్ వేదికగా జరిగిన ఆల్ఇండియా టెన్నిస్ అసోసియేషన్(ఏఐటీఏ) ఆధ్వర్యంలో జరిగిన అండర్-18 టోర్నీలో తెలంగాణ ప్లేయర్ వారణాసి సాయిఅనన్య రన్నరప్‌గా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో అనన్య 3-6, 1-6 తేడాతో ఆనందిత ఉపాధ్యాయ(హర్యానా) చేతిలో ఓడి రన్నరప్ టైటిల్ దక్కించుకుంది. తుది పోరులో ప్రత్యర్థికి దీటైన పోటీనివ్వడంలో ఈ యువ ప్లేయర్ విఫలమైంది. అనన్యకు టోర్నీ నిర్వాహకులు దినేశ్ అరోరా, హిమాంశు మాలిక్ ట్రోఫీతో పాటు సర్టిఫికేట్ అందజేశారు.



# పాపం ప్రభాస్.. 12 ఏళ్లుగా పాత పాటే

అదేంటీ బాసూ.. ప్రభాస్ సినిమా ఒక్కటి కూడా చెప్పిన టైమ్‌కు రాదా..? అరే 12 ఏళ్ళ నుంచి చూస్తున్నాం.. ఏ సినిమాను అనౌన్స్ చేసిన తేదీకి విడుదల చేయరు..? తప్పు మా హీరో చేస్తున్నాడా లేదంటే మీ ప్లానింగ్‌లోనే తప్పు ఉందా..? బయటికి చెప్పట్లేదు గానీ రెబల్ ఫ్యాన్స్ ఫ్రస్టేషన్ ఇదే. మరి దీనికి కారణమేంటి..? మళ్లీ కొత్తగా ఏమైందిప్పుడు..? ప్రభాస్ సినిమా ఈజ్ ఈక్వల్ టూ పోస్ట్‌పోన్ అని కొత్త లెక్కలు చెప్తున్నారు దర్శక నిర్మాతలిప్పుడు. అదేంటి అంత మాట అనేస్తున్నారు అనుకోవచ్చు.. కానీ జరుగుతుంది మాత్రం ఇదే. అప్పుడెప్పుడో మిర్చి నుంచి మొదలైన ఈ వాయిదాల పర్వం రాజా సాబ్ వరకు కంటిన్యూ అయ్యేలా కనిపిస్తుంది. ఎప్రిల్ 10న రాజా సాబ్ రాకపై అనుమానాలు మొదలయ్యాయి. ఆరు నూరైనా అనుకున్న తేదీకే రాజా సాబ్ వస్తాడని మేకర్స్ చెప్తున్నా.. ఇండస్ట్రీలో ప్రచారం మాత్రం మరోలా జరుగుతుంది. నిజానికి ఎప్పుడో రావాల్సిన రాజా సాబ్‌ను వేరే సినిమాల కోసం ఆపుతూ వచ్చింది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. తాజాగా ప్రభాస్ కాలికి గాయం కావడంతో.. సమ్మర్‌కు రావడం కష్టమే అని తెలుస్తుంది. ప్రభాస్ ప్రతీ సినిమాకు పోస్ట్‌పోన్ కామన్ అయిపోయింది. మిర్చి నుంచి మొదలైంది ఈ వాయిదాల పర్వం. ఆ తర్వాత బాహుబలి సిరీస్ రెండు మూడు సార్లు డేట్స్ మార్చారు. రాజమౌళి కదా సర్దుకున్నారు ఫ్యాన్స్. సాహోకు అలాగే జరిగింది. రాధే శ్యామ్, ఆదిపురుష్ అయితే మూడు నాలుగు సార్లు వాయిదా పడ్డాయి. ఇక కల్కి 2024 సంక్రాంతికి చెప్పి.. మే 9కి వాయిదా వేసి.. చివరికి జూన్ 27న విడుదలైంది. ఈ లెక్కన రాజా సాబ్ ఎప్పుడొస్తాడో..?

## ఓ స్త్రీ న్యాయపోరాటం

మలయాళ అగ్ర నటుడు సురేశ్‌గోపి, అనుపమ పరమేశ్వరన్ ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ'(జె.ఎస్.కె). యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రవీణ్ నారాయణన్ దర్శకుడు. జె.ఫణీంద్రకుమార్ నిర్మాత. ఉత్కంఠకు గురిచేసే కోర్ట్ డ్రామాగా ఈ సినిమా రూపొందిందని, జానకి అనే స్త్రీ తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు ద్వారా ఎలా ఎదుర్కొన్నది అనేదే ఈ సినిమా ప్రధాన ఇతివృత్తమని, కేసు వాదించే లాయర్‌గా సురేశ్‌గోపీ నటించారని, ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. బైజు సందోష్, మాధవ్ సురేశ్‌గోపి, దివ్య పిళ్లయి, అస్కర్ అలీ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: రెనదివ్.





# ఆ పదాలే మా హుక్ లైన్స్.. ట్రెండ్ సెట్ చేస్తున్న లిరిక్ రైటర్స్..

అగ్గిపుల్ల.. సబ్బుబిల్ల.. కుక్కపిల్ల కాదేదీ కవితకు అనర్హం అన్నారు కదా పెద్దలు. ఇప్పుడు మన లిరిక్ రైటర్స్ ఈ మాటనే బాగా గట్టిగా పట్టుకున్నట్లున్నారు. అందుకే సరదాగా అన్న మాటలతోనే పాటలు అల్లేస్తున్నారు. ట్రెండ్ అయిన పదాలనే తీసుకొచ్చి.. హుక్ లైన్స్‌గా పెట్టి ఖతర్నాక్ మాస్ సాంగ్స్ రాస్తున్నారు. తాజాగా అలాంటి పాటే మరోటి వస్తుంది. ఈ ఏడాది మొదట్లో వచ్చిన గుంటూరు కారంలో ఓ మాస్ సాంగ్ నుంచి నెక్స్ట్ ఇయర్ రానున్న రాబిన్ హుడ్‌లో కొత్త సాంగ్ వరుకు చాల సాంగ్స్ ట్రెండ్ అయిన పదాలతోనే వస్తున్నాయి. అవి హిట్ అవుతున్నాయి కూడా. అందుకే వాటినే హుక్ లైన్స్‌గా చేసుకొంటున్నారు లిరిక్ రైటర్స్. ఆ కుర్చీని మడతబెట్టి.. ఈ మాట ఓ తాత నోట్లోంచి వచ్చింది. ఆ తర్వాత సోషల్ మీడియాలో తిరిగింది.. అది తమన్‌కు బాగా నచ్చి గుంటూరు కారంలో ట్యూన్ అయింది.. ఆ పాటేమో 10 నెలలు తిరిగేసరికి 500 మిలియన్స్‌కు పైగా వ్యూస్ తెచ్చుకుంది. దీనంతటికీ ఆ కుర్చీ మడతబెట్టి అనే హుక్ లైనే కారణం. మొన్న డబుల్ ఇస్మార్ట్‌లోనూ కేసీఆర్ వాయిస్ వాడుకున్నారు మణిశర్మ. ఏం చేద్దాం అంటవ్ మరి అంటూ అప్పట్లో కేసీఆర్ ఓ ప్రెస్ మీట్‌లో చెప్పిన మాట బాగా ఫేమస్ అయింది. దాన్నే హుక్ లైన్‌గా తీసుకుని డబుల్ ఇస్మార్ట్‌లో మార్ ముంత ట్యూన్ ఇచ్చారు మణిశర్మ. తాజాగా రాబిన్ హుడ్‌లో దిల్ రాజు హుక్‌లైన్‌తో పాట వస్తుంది. అదిదా సర్‌ప్రైజ్ అంటూ సాగే ఈ పాటలో కేతిక శర్మ చిందేస్తున్నారు. సాంగ్ త్వరలోనే రానుంది. అదిదా సారూ.. అంటూ వారసుడు ఆడియో ఫంక్షన్‌లో దిల్ రాజు చెప్పిన మాటలు ఫుల్ ట్రెండ్ అయ్యాయి. దాన్నే ఇప్పుడు నితిన్ సినిమాలో వాడేసారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020